

ప్రమాద రహిత జిల్లాగా మారుద్దాం

జిల్లాను ప్రమాద రహితంగా మార్చాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. ట్రాఫిక్‌పై విద్యార్థులకు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. 8లో



రూ.4 కోట్లతో బ్రిడ్జి..

దుమ్ముగూడెం వద్ద పెదవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గిరిజనుల కష్టాలు తీరనున్నాయి. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 34° / 17°

జిల్లాలో శుక్రవారం ఉదయం ఎండ ప్రారంభమై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి హారతి, మంత్ర పుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ములకలపల్లి : మండల కేంద్రంలోని మంగపేట గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం (పాపులేషన్ రీసెర్చ్ టీం) గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో వైద్య సేవల వివరాలను బృందం సభ్యులు డాక్టర్ మురుగేషన్, డాక్టర్ సెంథిల్ అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా జనాభా ప్రాతిపదికన పీహెచ్‌సీకి రావాల్సిన మందులు, అందిస్తున్న వైద్యం వంటి అంశాలను పరిశీలించారు. రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మూకమామిడి హెల్త్ సబ్‌సెంటర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాయి కల్యాణ్, కృష్ణదీపక్ రెడ్డి, డాక్టర్ మధువరణ్, ఎన్‌హెచ్‌ఎం అకౌంట్స్ అధికారి భాను, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మ కష్టాలు తొలగేనా?



అర్ధంతరంగా నిలిచిన సీతమ్మ సాగర్ పనులు

ఉమ్మడి జిల్లాకు వర ప్రదాయనిగా సీతారామ

- గోదావరిపై సీతమ్మ సాగర్ పేరుతో బ్యారేజ్ నిర్మాణం
- అనుమతులు లేవంటూ ఎన్‌జీటీ ఆగ్రహం
- 20 నెలలుగా అడుగు ముందుకు పడని పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాజీవ్‌సాగర్ (దుమ్ముగూడెం), ఇందిరాసాగర్ (రుద్రంకోట) ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర విభజనతో ఈ రెండు ప్రాజెక్టులు రద్దయ్యాయి. కొత్తగా సీతారామ ప్రాజెక్టును తెలంగాణ తొలి ప్రభుత్వం తలపెట్టింది. ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లా పరిధిలో 6.50 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు 320 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అందులో భాగంగా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి, అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామాల మధ్య బ్రిటీష్ హయాంలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజ్ దిగువన సీతమ్మ సాగర్ పేరుతో మరో బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారు. 34 టీఎంసీల సామర్థ్యం గల ఈ బ్యారేజ్‌లోనే 280 మెగావాట్ల సామర్థ్యం గల జల విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది.

ఎన్‌జీటీ ఆదేశాలతో..

బ్యారేజ్ నిర్మాణానికి ముందే మూడు పంప్‌హౌస్‌లు, 100 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ నిర్మించారు. అయితే బ్యారేజ్ లేకపోవడంతో పంప్‌హౌస్‌లు నిరుపయోగంగా మారాయి. దీనిపై సర్వత్రా విమర్శలు రావడంతో కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు రాకముందే 2022లో బ్యారేజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. శరవేగంగా పనులు సాగుతుండగా పర్యావరణ అనుమతులతో పాటు నష్టపరిహారం విషయంపై స్థానికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఎన్‌జీటీ సీతమ్మ సాగర్ నిర్మాణ పనులు ఆపేయాలంటూ 2023 మేలో ఆదేశాలు జారీ చేసింది.

ఎక్కడి పనులు అక్కడే..

ఎన్‌జీటీ ఉత్తర్వులతో గత 20 నెలలుగా సీతమ్మ సాగర్ బ్యారేజ్ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఉత్తర్వులు వెలువడిన కొద్ది నెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిపోవడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో సీతమ్మ సాగర్ అంశంపై కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర సర్కారు దృష్టి సారించలేకపోయింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత సీతారామ ప్రాజెక్టు పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మూడు పంప్‌హౌస్‌లను అందుబాటులోకి తెచ్చింది. రాజీవ్ సాగర్ కెనాల్ నిర్మించి తద్వారా ఎన్ఎస్‌పీ ఆయకట్టుకు గోదావరి నీరందించేలా చకచకా అడుగులు వేసింది. ఈ క్రమంలో 2024 చివరి నాటికి సీతమ్మ సాగర్‌కూ పర్యావరణ అనుమతులు సాధిస్తామని రాష్ట్ర సర్కారు ప్రకటించింది.

నాలుగు నెలలుగా..

గతేడాది ఆగస్టులో జరిగిన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులో సీతారామ అంశంపై చర్చించారు. ఆ తర్వాత టెక్నికల్ అప్రైజల్ కమిటీలోనూ వాదనలు జరిగాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కాస్ట్ బెనిఫిట్ రేషియోపై కేంద్రం సంతృప్తి చెందిందనే వార్తలు వచ్చాయి. దీంతో త్వరలోనే సీతారామ డీపీఆర్‌కు అన్ని రకాల అనుమతులు వస్తాయనే నమ్మకం కలిగింది. అయితే గత నాలుగు నెలలుగా ఈ అంశంపై పురోగతి లేకుండా పోయింది. ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గగా జూన్ వరకు బ్యారేజ్ నిర్మాణ పనులకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికైనా అనుమతులు సాధిస్తే విలువైన సమయం వృథా కాకుండా పనులు జరిగే అవకాశం ఉంటుంది. లేదంటే మరో సీజన్ వృథా అవుతుంది. అనుమతుల జారీలో జాప్యం జరిగే కొద్దీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరుగుతుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై ఎక్కువ ఖర్చు పెట్టారనే అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది.

వేగంగా ఏర్పాట్లు

- చక చకా పురపాలక పనులు
- ఆస్తుల వివరాల సేకరణలో అధికారులు



అశ్వారావుపేట మున్సిపల్ కార్యాలయం

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీకి సంబంధించిన పనులు చక చకా సాగుతున్నాయి. అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం గ్రామపంచాయతీలను కలుపుతూ అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాత గ్రామపంచాయతీల కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ఆస్తుల వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీల స్థిర, చరాస్తుల వివరాలను జీపీ కార్యదర్శులు నమోదు చేస్తున్నారు.

జాబ్‌కార్డులు రద్దు

మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పనులు ఉండనందున ప్రస్తుతం ఉన్న 3,741 జాబ్‌కార్డులు ఇకపై రద్దు కానున్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధి పొందాలంటే జాబ్ కార్డులే ఆధారం. భూమి లేకుండా, 2024లో కనీసం 20 రోజులు ఉపాధి పని చేసిన వారినే అర్హులుగా గుర్తిస్తున్నారు. అయితే ఇప్పుడు మున్సిపాలిటీలోకి బదలాయించిన జాబ్‌కార్డుదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందా.. లేదా అనేది అధికారులకూ స్పష్టత లేదని తెలుస్తోంది.

మున్సిపాలిటీలో చేరిన గ్రామాల వివరాలిలా..

	అశ్వారావుపేట	గుర్రాలచెరువు	పేరాయిగూడెం	మొత్తం
జనాభా	22,366	1,248	8,082	31,696
విస్తీర్ణం (చ.కి.మీ)	39.01	6.83	7.8	53.64
పన్ను డిమాండ్ (రూ.లక్షల్లో)	72.69	0.7	17.15	90.54
నివాసగృహాలు	4,519	307	1,651	6,477
వ్యవసాయాధారిత కుటుంబాలు	1,419	270	280	1,969
వ్యవసాయభూమి (ఎకరాల్లో)	5,123	776	743	6,642
ఉపాధి హామీ జాబ్‌కార్డులు	2,841	293	607	3,741
కూలీలు	5,112	566	1,132	6,810
ఆక్టివ్‌లో ఉన్న జాబ్‌కార్డులు	475	91	318	884
పనిచేస్తున్న కూలీలు	543	125	457	1,125

ఎన్నికల నియమావళి అమలు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



గాంధీజీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న కలెక్టర్ పాటిల్, అదనపు కలెక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనతో పాటు పలువురు అధికారులతో గురువారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం బుధవారమే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎన్నిక ఫిబ్రవరి 27న జరుగుతుందని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, బస్టాండ్, పబ్లిక్ పార్కు వంటి ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై ఉన్న రాతలను చెరిపివేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని చెప్పారు.

గాంధీజీకి ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జేఈఈ మెయిన్స్‌లో భాగంగా బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోసం బీ.ఆర్క్ పరీక్ష గురువారం నిర్వహించారు. దీంతో గత వారం రోజులుగా జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు ముగిశాయి. బీ.ఆర్క్ పరీక్షకు మొత్తం 120 మందికి గాను 87 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

గాంధీజీ ఆశయ స్ఫూర్తిని కొనసాగించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మౌనం పాటిస్తున్న పీఓ, అధికారులు

భద్రాచలం: గాంధీజీ ఆశయ స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఐటీడీఏ సమావేశం మందిరంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్య్ర సాధనలో మహాత్మా గాంధీ ప్రత్యేక పాత్ర పోషించారని, సత్యం, అహింస మార్గాన్ని ఎంచుకొని పలు ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఎస్ఓ భాస్కర్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, పీవీటీజీ అధికారి మనిధర్, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ డేటా సకాలంలో అందిస్తాం..

గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ డేటా సకాలంలో అందజేస్తామని పీఓ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డేటా మొత్తం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, గురుకుల ఆర్‌సీఓ నాగార్జున రావు, జీసీసీ డీఎం సమ్మయ్య పాల్గొన్నారు.

'ఐటీసీ' పోరు నేడే..

- గుర్తింపు సంఘం ఎన్నికలకు ట్రేడ్ యూనియన్లు సిద్ధం
- కార్మికుల ఓట్ల కోసం భారీ నజరానాలు



సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. ఈ ఎన్నికలను అన్ని ట్రేడ్ యూనియన్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గత 50 రోజులుగా ప్రచారాన్ని హోరెత్తించగా ఈ పర్వానికి బుధవారం రాత్రి తెరపడింది. అనంతరం ప్రలోభాలతో ఓటర్లకు ఎర వేస్తున్నాయి. ఐటీసీ యాజమాన్యంతో 14వ వేతన ఒప్పందం చేసుకునేందుకు ఈ ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘానికే అవకాశం ఉండనున్న నేపథ్యంలో గెలుపు కోసం శక్తికొద్దీ ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ సంఘాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాగా, బీఆర్‌టీయూకు సీఐటీయూ, ఐఈయూ యూనియన్‌లు మద్దతిస్తున్నాయి.

ప్రలోభాలకు ఎర..

ప్రచారపర్వం ముగిసినప్పటి నుంచి విందు, మందుతో కార్మికులను ప్రలోభపెడుతున్న ఆయా సంఘాల నేతలు.. గురువారం నగదు పంపిణీకి తెరలేపారు. ముఖ్యంగా న్యూట్రల్‌గా ఉన్న ఓటర్లకు ఈ మూడు యూనియన్లూ శక్తిమేర నగదు, నజరానాలు అందిస్తున్నాయి. ఒక్కో ఓటుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అందిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కార్మిక శాఖ, ఐటీసీ యాజమాన్యం సంయుక్తంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఐటీసీ పరిసర ప్రాంతాల్లో పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ నిర్వహించి సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించనున్నారు. ఆ తర్వాత కూడా గొడవలు జరగకుండా ఐటీసీ, పరిసర గ్రామాల్లో పోలీసులు తగు నిబంధనలు విధించారు.

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, పక్కన జగదీశ్వర్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రారంభిస్తామని ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో టీఎస్‌జీఓస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఇరిగేషన్ శాఖలో ఏజెన్సీ అలవెన్స్ నిలిపి వేశారని, పునరుద్ధరించాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ తర్వాత ముఖ్యమంత్రితో సమావేశం కానున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించబడకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తామని ప్రకటించారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని శాఖల్లో ఖాళీలను డీపీసీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. అనంతరం యూనియన్ డైరీని సంఘం నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో టీఎస్‌జీఓ రాష్ట్ర సహ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటపుల్లయ్య, మహేష్, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, భార్గవ్ చైతన్య, ఎంపీఓ రాష్ట్ర అధ్యక్షుడు శేషాంజన్, నాయకులు డి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

ఖమ్మం లీగల్: రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాదుల క్రీడా పోటీలు శనివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా పోటీలను ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా న్యాయవాదులు హాజరుకానున్నారు.

రోడ్డు భద్రతే ప్రధానం



ఉత్తమ డ్రైవర్లతో డీటీఓ, ఏసీపీ, ఆర్ఎం తదితరులు

ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్ల సన్మానంలో అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ వాహన డ్రైవర్ రోడ్డు భద్రతా నియమావళిని పాటించడం ద్వారా ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వాహన వేగాన్ని అదుపులో ఉంచాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాద రహితంగా బస్సులు నడిపిన డ్రైవర్లను సన్మానించారు. ఖమ్మం రీజియన్‌లో మొదటి స్థానం ఖమ్మం డిపోనకు చెందిన బి.రాములు దక్కించుకోగా, ఆ తర్వాత స్థానాల్లో డి.ఆంథోని(ఖమ్మం), వి.వెంకటేశ్వర్లు(మణుగూరు) నిలిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ జీ.ఎస్.పవిత్ర, ఖమ్మం డీఎం దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జేడీ సరోజినీ దేవి

దమ్మపేట : పామాయిల్ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభం గడించవచ్చని ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి అన్నారు. మండల పరిధిలోని అల్లిపల్లి పామాయిల్ తోటలో గురువారం నిర్వహించిన కిసాన్ ప్రశ్న మంచ్ సీజన్-2 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పామాయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకొని, దిగుబడినిచ్చే ఏకైక పంట పామాయిల్ అన్నారు. పామాయిల్ శాస్త్రవేత్త రామచంద్రుడు మాట్లాడుతూ.. పామాయిల్‌లో అంతర పంటగా సాగు చేయదగిన వాటిలో కోకో ఉత్తమమైనదని చెప్పారు. అంతర పంటల సాగుతో అధిక ఆదాయంతో పాటు పామాయిల్ దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. అనంతరం పామాయిల్ సాగు తదితర అంశాలపై రైతులను పలు ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానం చెప్పిన రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పామాయిల్ శాస్త్రవేత్త సుబ్బన్న, సలహామండలి కమిటీ సభ్యులు అలపాటి రామచంద్ర ప్రసాద్, అధికారులు మధుసూదన్, విజయకృష్ణ, కిషోర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు నేర్పడమే కౌన్సిలర్ల బాధ్యత

డీఈఓ వెంకటేశ్వరాచారి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

కొత్తగూడెంఅర్బన్ : యుక్త వయసులో వచ్చే మార్పులు, తద్వారా వచ్చే మానసిక, సామాజిక, విద్యాపరమైన మార్పులను విద్యార్థులకు తెలియజేసి, వాటి ద్వారా ఎదురయ్యే ఒత్తిడిని ఎలా అధిగమించాలో నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయ కౌన్సిలర్లదేనని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. జిల్లాలోని 126 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం 'కొత్తగూడెంలో కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్‌పై శిక్షణ ఇవ్వగా, కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలల్లోనే గడుపుతున్నందున ఉపాధ్యాయులే వారికి మార్గ నిర్దేశకులు కావాలన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా పిల్లలతో మాట్లాడి, ఇబ్బందులను అధిగమించేలా వారిలో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారికి సరైన మార్గ నిర్దేశకత్వం వహిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ ఎం. ప్రభుదయాళ్, కే.గోపివరప్రసాద్, ఎస్‌కే. మీరాసాహెబ్, ఎస్.డి. రవి ప్రతాప్, బి.శ్యామచంద్రరావు వ్యవహరించారు.

క్లుప్తంగా

సింగరేణిలో అమరుల సంస్మరణ



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం పర్సనల్ కోడూరు శ్రీనివాసారావు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవరి 30న జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. వివిధ విభాగాల జీఎంలు, డీజీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మధిర జీడీసీ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మందడి రవీంద్రారెడ్డికి డాక్టరేట్ లభించింది. 'ఆయిల్ సీడ్స్, కల్టివేషన్ ఇన్ హైదరాబాద్ స్టేట్ యాన్ ఎనలిటికల్ స్టడీ ఫ్రమ్ 1911–1948' అంశంపై ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.దయాకర్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. సూర్యాపేట జిల్లా మోతే మండలం సిరికొండకు రవీంద్రారెడ్డి ప్రస్తుతం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ ప్రకటించడంతో ఆయనను గురువారం కళాశాలలో అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, అధ్యాపకులు డాక్టర్ శీలం ఇందిర, డాక్టర్ పి సుజాత, షేక్ అఫ్రోజ్, సురేష్, డాక్టర్ నిభానుపుడి సుబ్బరాజు, ఫణీంద్ర కుమార్, శ్రీనివాసరావు, అనిత, వెంకటలక్ష్మి, జ్యోతి, హారిక, శివకుమారి, మాధురి, ఉద్యోగులు అఫ్జల్, సునీల్, సత్యవతి, నాగలక్ష్మి, హరినాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

అనుమతి లేకుండా తీసిన కందకాలను పూడ్చిన ఆర్అండ్‌బీ అధికారులు



కందకాలను పూడ్చివేయిస్తున్న ఆర్ అండ్ బీ సిబ్బంది

దమ్మపేట : మండల పరిధిలోని గణేష్‌పాడు క్రాస్ రోడ్డు నుంచి గణేష్‌పాడు గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పక్కన విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 కేవీ టవర్ నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు గురువారం అడ్డుకున్నారు. ఆర్ అండ్ బీ అనుమతులు లేకుండా బీటీ రోడ్డు పక్కన విద్యుత్ శాఖ అధికారులు మినీ టవర్ల నిర్మాణం కోసం కందకాలు తీశారని జేఈ శ్రీనివాస్ ఆరోపించారు. రోడ్డు మధ్య నుంచి 33 అడుగుల దూరంలో నిర్మించాల్సిన టవర్లను 10 అడుగుల దూరం లోపు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ పనులకు, టవర్లు అడ్డంకిగా మారుతాయని అన్నారు. కందకాలు తీయిస్తున్న విద్యుత్ సిబ్బందిని అడ్డుకుని, డోజర్ సహాయంతో కందకాలను పూడ్చామని తెలిపారు.

లారీడ్రైవర్ చాకచక్యం.. విద్యార్థికి తప్పిన ప్రమాదం



హైవేపై అడ్డంగా వెళ్తున్న విద్యార్థి (సర్కిల్‌లో)

నేలకొండపల్లి: ఓ లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బాలుడికి ప్రమాదం తప్పింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుండగా వీడియోలు గురువారం వైరల్‌గా మారాయి. గ్రామానికి చెందిన ఓ విద్యార్థి సైకిల్‌పై సర్వీస్ రోడ్డు మీదుగా కోదాడ–ఖమ్మం జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. అదే సమయాన ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న లారీని గమనించలేదు. అయితే, లారీ డ్రైవర్ మాత్రం బాలుడు కనిపించగానే వేగంగా ఉన్న వాహనాన్ని అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఆ వెంటనే బాలుడు అక్కడి నుంచి వెళ్లిపోగా, వివరాలు తెలియరాలేదు. కాగా, లారీకి అడ్డంగా సైకిల్ వచ్చిన సమయంలో మరో ద్విచక్ర వాహనదారుడు సైతం రాంగ్ రూట్‌లో వెళ్తున్న దృశ్యం సీసీ కెమెరాలో నమోదైంది.

రూ.4కోట్లతో పెదవాగుపై బ్రిడ్జి..



పెదవాగుపై హై లెవల్ వంతెన నిర్మించనున్న ప్రదేశం

- హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు
- బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ఆదివాసీ గిరిజనుల కష్టాలు

దుమ్ముగూడెం : పెదవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణం పూర్తయితే గిరిజనుల కష్టాలు తీరనున్నాయి. ఎగువన కురిసిన వర్షాలతో మండలంలోని సింగవరం, ఎస్.లక్ష్మీపురం గ్రామాల మధ్య పెదవాగుకు వరద ఉధృతి పెరుగుతుంది. దీంతో వర్షాకాలంలో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో 2019లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.కోటితో ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు లో లెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు. ఆ వంతెన వరద ఉధృతికి తట్టుకోలేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అనుకున్నట్లుగానే వంతెన నిర్మించిన మూడు నెలలకే వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఎస్.లక్ష్మీపురం గ్రామప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రాన్ని కలుపుతూ ఉన్న రహదారి నిర్మించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో సింగవరం, ఎస్.లక్ష్మీపురం గ్రామాల మధ్య పెదవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వంతెన నిర్మాణం పూర్తయితే ఎస్.లక్ష్మీపురం గ్రామస్తులు సింగవరం నుంచి వర్షాకాలంలో రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు అడ్డంకులు ఉండవు. పెదకమలాపురం, చినకమలాపురం, అడవిరామవరం, ఎర్ర బోరు, కొత్తూరు తదితర గ్రామాల ఆదివాసీలు భద్రాచలం వెళ్లేందుకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

పటిష్టంగా నిర్మించాలి

2019లో నిర్మించిన వంతెన ఇంజనీరింగ్ డిజైన్ లోపం కారణంగా కొట్టుకుపోయిందనే విమర్శలు వెల్లువెత్తాయి. వాగు ఉధృతి స్థాయిని తెలుసుకోకుండా వంతెన నిర్మాణ పనులు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. వంతెన కొట్టుకుపోవడంతోపాటు పక్కన ఉన్న పొలాల గట్లు సైతం కోసుకుపోయాయి. ఈసారైనా వాగు ఉధృతిని తట్టుకునేలా బ్రిడ్జిని పటిష్టంగా నిర్మించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

బాధలు తీరనున్నాయి



సింగవరం–ఎస్ లక్ష్మీపురంల మధ్య రాకపోకలు సాగించేందుకు రెండు గ్రామాల ఆదివాసీలు నరకయాతన పడుతున్నారు. వర్షాకాలం మూడు నెలలు చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాఇయ. పెదవాగుపై వంతెన నిర్మాణం పూర్తయితే మా బాధలు తీరుతాయి. – బూరం మణేశ్వరరావు, సింగవరం మాజీ ఉప సర్పంచ్

ఎదురుచూస్తున్నాం



పెదవాగుపై బ్రిడ్జి మంజూరు కావడం ఆనందంగా ఉంది. తక్షణమే పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం చేపడితే వర్షాకాలంలో మేము పడే బాధలు తప్పుతాయి. ఈసారైనా అధికారులు వరద ఉధృతిని అంచనా వేసి వంతెన నిర్మాణం చేపట్టాలి. –కాటిబోయిన శేఖర్, ఎస్.లక్ష్మీపురం

రేపటితో ముగియనున్న ఇద్దరు డైరెక్టర్ల పదవీకాలం



ఎన్వీకే.శ్రీనివాస్



జి.వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే.శ్రీనివాస్, డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి పదవీకాలం శనివారంతో ముగియనుంది. వీరిద్దరూ 2023 ఫిబ్రవరి 01న బాధ్యతలు స్వీకరించారు. ఇందులో వెంకటేశ్వరరెడ్డి ఈ ఏడాది జూలై 31న రిటైర్డ్ కానుండగా, ఎన్వీకే శ్రీనివాస్ 31-07-2026 వరకు విధుల్లో కొనసాగనున్నారు. అయితే రెండేళ్ల కాలపరిమితితో నియమించిన డైరెక్టర్ పోస్టులు మాత్రం రేపటితో ముగియనున్నాయి. ఆ తర్వాత వీరినే కొనసాగిస్తారా, కొత్త వారిని నియమిస్తారా అనేది తేలాల్సి ఉంది.

అమలులో ఎన్నికల కోడ్..

డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ పీపీల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఈ పోస్టులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ బుధవారమే వెలువడడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో సింగరేణిలో గురువారం నిర్వహించాల్సిన మైనింగ్ సర్దార్‌ల వెబ్‌కౌన్సిలింగ్ కూడా వాయిదా పడింది. కోడ్ ఉన్నందున డైరెక్టర్ల ఎంపికను రహస్యంగా చేస్తుందా, లేక ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందా అనే సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉండగా ఆపరేషన్స్ డైరెక్టర్, డైరెక్టర్ పాగా విధులు నిర్వహిస్తున్న ఎన్వీకే శ్రీనివాస్‌ను ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ఆరు నెలల క్రితం ఆ పోస్టుల నుంచి తొలగించి ఇతర డైరెక్టర్లకు అప్పగించారు. త్వరలోనే వారు కూడా ఉద్యోగ విరమణ చేయనుండడంతో వారి పదవీ కాలాన్ని పొడిగిస్తుందా, లేక ఇంటర్వ్యూలు నిర్వహించి కొత్త వారికి అప్పగిస్తుందా అనేది వేచి చూడాలి.

'గోర్‌బోలీ'ని రాజ్యాంగంలో చేర్చాలి



మాట్లాడుతున్న కోట్యానాయక్

చంద్రుగొండ : గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చి అధికారిక భాషగా గుర్తించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెంకటియాతండాలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించాలన్నారు. ఉద్యోగాలను 100 శాతం స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బాలాజీనాయక్, నాయకులు మోహన్‌నాయక్, భాస్కర్‌నాయక్, మండల నాయకులు భూక్య చిన్నేష్, శివ, జీవన్, బాబూరావు, భద్రు పాల్గొన్నారు.

ప్రమాద రహిత జిల్లాగా మారుద్దాం

ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. అందరి సహకారంతో జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా మారుద్దామని పేర్కొన్నారు. గురువారం సింగరేణి ప్రకాశం స్టేడియంలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, వాహనదారులకు, ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. తొలుత ట్రాఫిక్ నియమాలను వివరిస్తూ ఆటపాటలతో కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్, మద్యం తాగి వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. అనంతరం పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటోలకు ప్రత్యేకంగా తయారు చేసిన స్టిక్కర్లను అందజేశారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, చంద్రభాను, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ, కొత్తగూడెం సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్, శివప్రసాద్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై నరేష్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆబోతు నేరుగా ఆస్పత్రికి..!

చికిత్స అనంతరం గ్రామానికి చేర్చిన స్థానికులు

సత్తుపల్లి/పెనుబల్లి: ప్లాస్టిక్ వ్యర్థాలు మింగడంతో అస్వస్థతకు గురైన ఓ ఆబోతు నేరుగా ఆస్పత్రికి వచ్చింది! రెండు రోజుల పాటు కదలకుండా ఉండడంతో అనుమానం వచ్చిన సిబ్బంది పరీక్షించగా అస్వస్థత విషయం బయటపడడంతో చికిత్స చేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కారాయిగూడెంలోని కృష్ణుడి గుడి వద్ద 14ఏళ్ల వయస్సు ఉన్న ఆబోతు కొన్నేళ్లుగా ఉంటోంది. అది కారాయిగూడెం నుంచి తొమ్మిది కి.మీ. దూరాన ఉన్న పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణకు బుధవారం చేరుకోగా అక్కడే మూలుగుతూ ఉండిపోయింది. గడ్డి వేసినా తినకపోగా కదలకపోవడంతో అనుమానం వచ్చిన 108 సిబ్బంది గురువారం పశువైద్య అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పశువైద్యాధికారి సృజన చేరుకుని పరీక్షించగా ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో అస్వస్థతకు గురైనట్లు తేలింది. ఈమేరకు చికిత్స చేశాక కారాయిగూడెం వాసులకు సమాచారం ఇవ్వడంతో వాహనంలో తమ గ్రామానికి తీసుకెళ్లారు.

ఆటో ఉయ్యాలా.. నేనే ఊగాల..





ఉయ్యాల సాధారణంగా ఇంట్లో, పని ప్రదేశాల్లో చెట్ల కొమ్మలకు కడుతుంటారు. కానీ అశ్వారావుపేటలో ఓ మహిళ ఆటోలో ఉయ్యాల కట్టి జోలపాడింది. గురువారం కుడుములపాడుకు చెందిన మహిళ ఏడాది వయస్సు ఉన్న తన చిన్నారికి ఆధార్ కార్డు తీయించేందుకు మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసు వెనుక ఉన్న ఆధార్ సెంటర్‌కు తీసుకొచ్చింది. అక్కడ రద్దీ ఉండటంతో ఆగి ఉన్న ఆటోలో చీరతో ఉయ్యాల కట్టి చిన్నారిని నిద్రపుచ్చింది. – అశ్వారావుపేటరూరల్

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: చెక్కు బౌన్స్ కేసులో కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన కొడాలి నర్సింహారావుకు ఏడాది జైలుశిక్ష విధించడంతోపాటు రూ.5 లక్షలు చెల్లించాలని మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత గురువారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు... కొత్తగూడెం పట్టణంలోని రామవరానికి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు వద్ద 2018లో సన్యాసి బస్తీకి చెందిన కొడాలి నర్సింహారావు రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని కోటేశ్వరరావు కోగా నర్సింహారావు రూ. 4,50,000కు చెక్కు ఇచ్చాడు. చెక్కు బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయింది. దీంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా.. న్యాయమూర్తి విచారణ చేపట్టి పైవిధంగా తీర్పు చెప్పారు. కంభంపాటి కోటేశ్వరరావు తరఫున న్యాయవాదులు జీవీ ప్రసాద్, జియాహుల్ హుస్సేన్, సవిత వాదించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మల్లెలమడుగు గ్రామానికి కామిశెట్టి భవాని, బిందు మరో ఇద్దరు ప్రయాణికులు ఆటోలో అశ్వాపురం వెళ్తుండగా మొండికుంటలో పెట్రోల్ బంక్ దాటాక ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న భవాని, బిందుకు గాయాలుకాగా, చికిత్స నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని గ్రామీణ వైద్యుడి మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ గ్రామీణ వైద్యుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన సాధు భక్తవత్సం కుమార్(70) కొన్నేళ్లుగా గ్రామీణ వైద్యుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదికాలంగా ఏపీలోని ఏలూరు జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడిమెట్టలో నివాసం ఉంటున్నారు. కాగా, గురువారం అశ్వారావుపేటలో ఓ జరిగే వివాహ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యలోని కొయ్యలగూడెం వద్ద విశాఖపట్నం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీట్టింది. దీంతో తీవ్ర గాయాలై భక్తవత్సం కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కొయ్యలగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి డ్రైవర్..



డబ్బా కొట్టును ఢీకొట్టిన ట్రాక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ట్రాక్టర్‌తో బయటకు వెళ్తున్న డ్రైవర్ అకస్మాత్తుగా జారి కింద పడడంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఘటన వివరాలు.... కేఎంసీ నుంచి పారిశుద్ధ్య ట్రాక్టర్‌ను డివిజన్‌కు తీసుకెళ్లేందుకు వచ్చిన డ్రైవర్ శికుమార్ కార్యాలయ సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్దకు రాగానే ట్రాక్టర్ పైనుండి కింద పడ్డాడు. దీంతో ట్రాక్టర్ నేరుగా వెళ్లి సమీపంలోని డబ్బా కొట్టును ఢీకొని ఆగిపోయింది. కాగా, డ్రైవర్‌ను స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స చేసి ఇంటికి పంపించారు. అయితే, మార్గమధ్యలోనే ఆయన అస్వస్థతకు గురి కాగా మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చేసరికి శివ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈమేరకు మేయర్ పి.నీరజ, అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో శివ కుటుంబానికి రూ.10 వేలు అందజేయగా, త్వరలోనే రూ.2లక్షల ఆర్థిక సాయం, శివ కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని వెల్లడించారు. కాగా, ట్రాక్టర్ డబ్బా కొట్టును ఢీకొనడంతో ధ్వంసం కాగా, అక్కడ పాల ప్యాకెట్లు వేసేందుకు వచ్చిన ఇద్దరు ప్రమాదం త్రుటిలో బయటపడ్డారు.

ప్రభుత్వ ఆస్పత్రి కోసం ఇటీవల కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించిన సింగరేణి స్థలం



ప్రభుత్వ స్థలాల్లేక..

- ఇల్లెందులో పక్కా భవనాల నిర్మాణానికి ఇక్కట్లు
- ప్రతీసారి సింగరేణి యాజమాన్యంపైనే ఆధారం
- అధికారులకు తలనొప్పిగా మారిన భూ సేకరణ

ఇల్లెందు: పట్టణంలో ప్రభుత్వ స్థలాలు కరువయ్యాయి. ఫలితంగా వివిధ కార్యాలయాలు, పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించలేక పోతున్నారు. ప్రతీసారి సింగరేణిపైనే ఆధార పడుతుండటంతో ఆ సంస్థ కూడా స్థలాలు కేటాయించేందుకు నిరాకరిస్తోంది. ప్రస్తుతం సమీకృత గురుకులం, 100 పడకల ప్రభుత్వాస్పత్రి, మైనారిటీ గురుకులం, ఎస్సీ బాలికల గురుకులం, బీసీ బాలుర గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాల్సి ఉంది. కోల్డ్ స్టోరేజీ, ఏటీఐ కోసం ఏర్పాటుకు స్థలం కావాలి. ఏ భవన నిర్మాణం చేపట్టాలన్నా ఐదు నుంచి 25 ఎకరాల వరకు స్థలం అవసరమవుతోంది. మరోవైపు ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక అధికారులు, ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కోరం కనకయ్య తహసీల్దార్ రవికుమార్‌తో ప్రభుత్వ స్థలాల లభ్యతపై చర్చించారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల భవనానికి 25 ఎకరాల స్థలం కావాల్సి ఉండగా, బైపాస్ రోడ్‌లో రైలు పట్టాల నుంచి మున్సిపాలిటీ డంప్ యార్డు వరకు ఉన్న స్థలాన్ని గుర్తించారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్థలాన్ని సందర్శించారు. అయితే ఏళ్ల తరబడి ఆ భూమిని సాగు చేసుకుంటున్నవారు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. భూమికి సంబంధించిన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఇప్పటికే నోటీస్ జారీ చేశారు. ఏమీ ఆటంకాలు లేకపోతే ఇక్కడ గురుకులం నిర్మించే అవకాశం ఉంది.

100 పడకల ఆస్పత్రి

100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఐదెకరాల స్థలం అవసరం కాగా, జేకే ఏరియాలో కొన్ని సింగరేణి క్వార్టర్లను తొలగించి, ఆ స్థలంలో నిర్మించాలని నిర్ణయించారు. కారేపల్లి వెళ్లే బైపాస్ రోడ్డులో సింగరేణి పార్క్ వద్ద ఐదెకరాల స్థలం ఉన్నా.. అది ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించలేదు. ఇక ప్రభుత్వం ఐటీఐలను ఏటీఐలుగా మార్చుతున్న తరుణంలో ఇల్లెందు ఏటీఐకి 30 ఎకరాల వరకు స్థలం అవసరం ఉంది. 30 ఎకరాల సేకరణ అధికారులకు కత్తిమీద సాములా మారింది.

అందుబాటులోలేని ప్రభుత్వ స్థలాలు

పట్టణంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. భూమి అంతా సింగరేణి చేతిలోనే ఉంది. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గ్రంథాలయం, గిరిజన భవన్, మినీ స్టేడియం సింగరేణి స్థలాల్లో నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పడావుగా ఉన్న క్వార్టర్లను గత ప్రభుత్వ హయాంలో కుల సంఘాలకు కేటాయించారు. రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఓల్డ్ క్వార్టర్స్‌లో మల్టీ యుటిలిటీ ఫంక్షన్ హాల్ నిర్మించారు. లేక్ వ్యూ పార్క్ రోడ్‌లో ఫారెస్టు భూమిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫారెస్ట్ కార్యాలయం కూల్చి గిరిజన కమ్యూనిటీ హాల్, కోర్టు సమీపంలో ఆర్అండ్‌బీ స్థలంలో అంబేద్కర్ భవన్ నిర్మిస్తున్నారు. ఇలా ఏ భవనం నిర్మించాలన్నా సింగరేణి, ఇతర ప్రభుత్వ శాఖల ఆధీనంలోని భూముల్లో నిర్మించాల్సి వస్తోంది. పట్టణంలోని జేకే ఏరియాలో చాలా వరకు సింగరేణి క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. కార్మికుల సంఖ్య తగిన క్వార్టర్లను మినహాయించి మిగిలిన క్వార్టర్ల స్థలాన్ని ప్రభుత్వ భవనాలు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

రైతు, కూలీల వ్యతిరేక విధానాలపై పోరాటం

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం రైతు, కూలీలకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విదానాలపై పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, కార్పొరేట్, మతోన్మాద శక్తుల్ని మాత్రం అక్కున చేర్చుకుంటోందని ఆరోపించారు. దేశంలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుండగా కేంద్రం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తగ్గిస్తోందని విమర్శించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, నాయకులు బుర్రి ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వత్సవాయి జానకీరాములు తదితరులు పాల్గొన్నారు.